క్లుప్తంగా

వానొస్తే ఇబ్బందులే..

వర్షానికి ఉరుస్తోన్న పాఠశాల భవనం



డబ్బాలు పెట్టి పక్కన కూర్చున్న విద్యార్థులు

హత్నూర(సంగారెడ్డి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హత్నూర మండలం భీమ్లా తండా ప్రాథమిక పాఠశాల పైకప్పు ఉరుస్తోంది. బుధవారం విద్యార్థులు, టీచర్ తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తండాలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 15 మంది విద్యార్థులు, ఉపాధ్యాయురాలు భవాని ఉన్నారు. పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దీంతో వర్షం కురిసినప్పుడల్లా పడుతున్నారు. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. భారీవర్షాలు కురిస్తే పాఠశాల మొత్తం వర్షం నీటితో నిండిపోతుందని వాపోయారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు



కట్టడాన్ని తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నారాయణఖేడ్: పట్టణంలోని రాయిపల్లి రోడ్డు మార్గంలో పలుచోట్ల దుకాణాల ఎదుట మురుగు కాల్వపై అక్రమ కట్టడాలు నిర్మించారు. వరదనీరు మురుగు కాల్వలోకి వెళ్లలేక రోడ్డుపైనే పారుతోంది. దీంతో 100 రోజుల ప్రణాళిక భాగంగా బుధవారం మున్సిపల్ సిబ్బంది ఆయా కట్టడాలను కూల్చివేసి రోడ్డుపై నుంచి పారే వరదనీటిని మురుగు కాల్వలోకి మళ్లించారు. మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్, శానిటరీ అధికారి శ్రీనివాస్ పర్యవేక్షించారు. మురుగు కాల్వలపై ఎవరైనా అక్రమంగా కట్టడాలు నిర్మిస్తే చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

మోర్గి మాడల్ స్కూల్ సందర్శన



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు

నారాయణఖేడ్: నాగల్‌గిద్ద మండలంలోని మోర్గి మాడల్ స్కూల్, కళాశాలను బుధవారం న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు సందర్శించారు. ఎంఎల్ఎస్‌సీ ప్యానల్ అడ్వకేట్ డి.చంద్రశేఖర్‌రావు, న్యాయవాదులు సుధాకర్, రాజు నాయక్, సిబ్బంది, నాగల్‌గిద్ద ఏఎస్ఐ రవీందర్ పాఠశాలను పరిశీలించారు. విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని, ఏమైనా సమస్యలు ఉంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

కేసీఆర్ హయాంలోనే రైతులకు పెద్దపీట



సమావేశంలో మాట్లాడుతున్న విఠల్

రాయికోడ్(అందోల్): రైతు సంక్షేమానికి రైతు బంధు, రైతుబీమా పథకాలను అమలు చేసిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు విఠల్ అన్నారు. బుధవారం రాయికోడ్‌లో తమ పార్టీ మండల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. మండలానికి గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్మాణానికి రూ.4.39 కోట్లు, బ్రిడ్జిల నిర్మాణానికి రూ.4.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అలాగే, గ్రామాల్లో సీసీ రోడ్లు, వైకుంఠ ధామాలు, డంప్‌యార్డుల నిర్మాణం కోసం రూ.6.40 కోట్ల నిధులను మంజూరు చేసి రైతు ,అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో అసలే ఏం అభివృద్ధి జరగలేదని అధికార పార్టీ నాయకులు చెప్పడం విచారకరమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తుకారాం తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌కు ఓటమి భయం

నారాయణఖేడ్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 20నెలలు గడుస్తున్నా ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పత్తిరి రామకృష్ణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరుణ్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం బీజేపీ ఖేడ్ మండల స్థాయి స్థానిక సంస్థల ఎన్నికల వర్క్‌షాప్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లాలన్నారు.

ఆస్పత్రి నిర్వహణపై నిర్లక్ష్యం

- పని చేయని సీసీ కెమెరాలు
- మూతపడిన మరుగుదొడ్లు
- భరించలేని కంపుతో రోగుల అవస్థలు

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు ఆదేశాలున్నా స్థానిక అధికారులు మాత్రం ఆస్పత్రి మౌలిక వసతుల నిర్వహణపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. మండల కేంద్రం ఝరాసంగంలో రోగుల సౌకర్యార్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత కొన్ని సంవత్సరాల క్రితం స్థానిక ఆస్పత్రిలో నిర్వహణ, మెరుగైన వైద్య సేవలను గుర్తించి రాష్ట్ర, జాతీయస్థాయిలో అవార్డులను అందించారు. కానీ, ప్రస్తుతం నిర్వహణను అధికారులు పట్టించుకోవటం లేదని విమర్శలు వస్తున్నాయి.

పని చేయని సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు

ఆస్పత్రిలో నిత్యం నిఘాను ఉంచేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అవి పని చేయటం లేదు. విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవటం లేదు. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం మరుగుదొడ్లను నిర్మించారు. నిర్వహణ చేపట్టకపోవటంతో మరుగుదొడ్లను మూసేశారు. మరికొన్ని దుర్వాసనను వెదజల్లుతున్నాయి. ప్రతి రోజు పారిశుద్ధ్యం పనులు చేపట్టి హాజరు పట్టికలో నమోదు చేయాల్సి ఉన్నా అవేమి పట్టించుకోవటం లేదు. 2022 సంవత్సరంలో ఉన్న హాజరు పట్టిక నేటి వరకు అందులో ఎంట్రీ చేయలేకపో యారు. ఆస్పత్రిలో చాలా చోట్ల విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. ఆస్పత్రిలోని చెత్తను వేర్వేరుగా సేకరించాల్సి ఉన్నా చేయలేకపోతున్నారు. బయోమెడికల్ నిల్వ ఉంచే ప్రదేశంను ఖాళీగా దర్శనం ఇస్తుంది.



పని చేయని సీసీ కెమెరా



మూసిన మరుగుదొడ్లు

ఆస్పత్రి చుట్టూ చెత్తా చెదారంతో నిండిపోయింది.

పట్టించుకోని అధికారులు

ఆస్పత్రి నిర్వహణపై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా పట్టించుకోవటం లేదు. వివిధ సమస్యలతో హాస్పిటల్‌కు రోగులు అవస్థలు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవటం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకుని నిర్వహణ పనులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: విశ్వశాంతి కోసం 18 సంవత్సరాలుగా పాదయాత్ర వీరశైవ లింగాయత్ సమాజం నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వీరశైవ లింగాయత్ సమాజం పటాన్‌చెరు ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పటాన్‌చెరు నుంచి బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయం వరకు నిర్వహించే 18 వ మహా పాదయాత్ర పోస్టర్‌ను బుధవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి ఏడాది పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు కొనసాగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

బ్రిడ్జి నిర్మాణానికి నిధుల మంజూరు



మంత్రి దామోదరను సన్మానిస్తున్న నాయకులు

మునిపల్లి(అందోల్): తక్కడపల్లి, గార్లపల్లి మధ్యన బ్రిడ్జి నిర్మాణానికి రూ.17.8 కోట్ల నిధుల మంజూరు సంబంధించిన జీఓ విడుదల చేసిన సందర్భంగా మంత్రి దామోదరను మండల కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. బుధవారం దామోదర రాజనర్సింహ్మను శాలువా కప్పి సన్మానించి స్వీటు తినిపించారు. నిధుల మంజూరుకు కృషి చేసినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సతీష్‌కుమార్, రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, వెంకట్ లక్ష్మారెడ్డి, నర్సింహ్మాగౌడ్, అంజిరెడ్డి, వెంకట్‌రాములు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ అధికారులపై ఆగ్రహం

జిన్నారం (పటాన్‌చెరు): రెవెన్యూ అధికారుల విధులకు గైర్హాజరు కావడంతో విషయం మండలంలో చర్చనీయాంశంగా మారింది. బుధవారం మధ్యాహ్నం 12 గంటలైన రెవెన్యూ కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయని ఆయా గ్రామాల నుంచి పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్ కుర్చీలు ఖాళీగా కనిపించడంతో విసిగిపోయారు. గంటల తరబడి అధికారుల కోసం వేచి చూసిన రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయం ఎదుట పడి కాపులు పడుతున్నామని మండల ప్రజలు వాపోయారు. కార్యాలయ సిబ్బంది మాత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం ఉన్నందున వెళ్లారని చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ

కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

హత్నూర(సంగారెడ్డి): కార్మికుల హక్కుల పరిరక్షణకు బీఎంఎస్ పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్రభు అన్నారు. బుధవారం హత్నూర మండలం గుండ్లమాచునూరు గ్రామ శివారులోని ఆర్చి ఫార్మా ల్యాబ్ పరిశ్రమ వద్ద బీఎంఎస్ 70 ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల సాధన కోసం బీఎంఎస్ ఎప్పుడు ఉద్యమంలో ముందుంటుందన్నారు. కార్మికులు కార్మికుల సంక్షేమం కోసం పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు జనార్దన్ రెడ్డి, రాజయ్య, మురళి, పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు.

బంద్ విజయవంతం

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన బంద్ విజయవంతమైంది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ.. 18 నెలలుగా విద్యాశాఖ మంత్రి లేకుండా పాలన సాగిస్తుండటంతో సమస్యలు విలయతాండవం చేస్తున్నాయన్నారు.ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పేరుకే విద్యా కమిషన్ ఏర్పాటు చేశారని, వారి సూచనలు అమలుకు నోచుకోలేదని ఆరోపించారు.



నారాయణఖేడ్‌లో ప్రదర్శన చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాల బాధ్యులు



జోగిపేటలో విద్యా సంస్థలను బంద్ చేయిస్తున్న నేతలు



పటాన్‌చెరు: పాఠశాలలను బంద్‌ను చేయిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



సదాశివపేట పట్టణంలో విద్యాసంస్థలు బంద్ చేస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగండి

గీతం ఉపకులపతి ప్రొఫెసర్ డిసౌజా

పటాన్‌చెరు: విశ్వవిద్యాలయం కేవలం వినోదం కోసం కాదని, అంకితభావం, పరివర్తన కోసం నిర్దేశించిన ప్రదేశమని, ఇక్కడున్న అత్యుత్తమ వనరులన్నింటినీ సద్వినియోగం చేసుకుని పరిపూర్ణ వ్యక్తులుగా ఎదగాలని తొలి ఏడాది విద్యార్థులకు గీతం ఉప కులపతి ప్రొఫెసర్ డిసౌజా ఉద్బోధించారు. పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం తొలి ఏడాది విద్యార్థుల ఇంట్రొడక్షన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన వర్చువల్ గా ప్రారంభించారు. కొత్తగా చేరిన విద్యార్థులను విశ్వవిద్యాలయం యొక్క విద్యా వ్యవస్థ, పలు విభాగాలు, ప్రాంగణ జీవితం, విద్యార్థి క్లబ్‌లు, కెరీర్ మార్గదర్శక సూచనలు, క్రీడా మౌలిక సదుపాయాలను పరిచయం చేయడానికి ఉద్దేశించిన ఈ కార్యక్రమం ఆగస్టు 1 వరకు కొనసాగనుందని తెలిపారు.

రాయికోడ్ డీటీగా నరేష్



రాయికోడ్ (అందోల్): రాయికోడ్ తహసీల్దార్‌గా కార్యాలయానికి బదిలీపై వచ్చిన డిప్యూటీ తహసీల్దార్ నరేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీటీగా విధులు నిర్వహించిన విజయ్‌కుమార్ సంగారెడ్డి డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేసి, సంగారెడ్డి డీటీగా ఉన్న నరేష్‌ను రాయికోడ్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా బదిలీ చేశారు.

భక్తుల పాదయాత్ర

నారాయణఖేడ్: శ్రావణమాసం ప్రారంభోత్సవం పురస్కరించుకొని ఖేడ్‌కు చెందిన భక్తులు ఝరాసంఘం శివాలయానికి బుధవారం పాదయాత్రగా బయలుదేరారు. గురువారం ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు చేయనున్నారు. శ్రావణమాసం సందర్భంగా 6వ పాదయాత్ర, గురుస్వామి వెంకటరమణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌నాయక్‌ల ఆధ్వర్యంలో 50మంది భక్తులు 50కిలో మీటర్లు పాదయాత్రగా వెళ్లారు.

ఎల్‌ఓసీ అందజేత

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని అల్లీపూర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన మ్యాతరి దృపతమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరయిన రూ.2లక్షల ఎల్‌ఓసీ మంజూయింది. బుధవారం ఎమ్మెల్యే మాణిక్‌రావు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దృపతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పేదరికం కారణంగా ఆర్థిక సహాయం కోసం ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఎల్‌ఓసీ మంజూరు చేయించి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నామ రవి కిరణ్ పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం

రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి

మునిపల్లి(అందోల్): విద్యా, వైద్యంతో పాటు గ్రామాలకు వెళ్లే రోడ్ల అభివృద్ధికి మంత్రి దామోదర అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బుదేరాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ కుమార్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ఇంటింటికి వివరించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయా గ్రామాల బీటీ రోడ్ల అభివృద్ధికి మంత్రి నిధుల మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకటలక్ష్మారెడ్డి, నర్సింహ్మాగౌడ్, మాజీ ప్రజాప్రతినిధులు విజయ్‌కుమార్, చీలపల్లి వీరన్న పాటిల్, అంజిరెడ్డి, పాండు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన కాంగ్రెస్ నాయకులు

సీజనల్ వ్యాధులపై అవగాహన



సదస్సులో కమిషనర్ దశరథ్, వైద్యాధికారులు

జిన్నారం (పటాన్‌చెరు): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ దశరథ్ పేర్కొన్నారు. గుమ్మడిదల పట్టణ పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి మధుకర్ బుధవారం సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... కాలానుగుణంగా వ్యాపించే వ్యాధుల నియంత్రణకు అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. వ్యక్తిగత, పరిసరాలు పరిశుభ్రత ప్రాముఖ్యతను, నిత్యం చేతులు శుభ్రంగా కడుకోవడం డ్రైడే వంటి అంశాలపై ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఆగస్టు 10 నుంచి మాస్ డ్రంగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రలను ప్రతిఒక్కరికి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నిర్మల, అరుణ

వట్‌పల్లి(అందోల్): మామిడి సాగులో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నిర్మల, అరుణ పేర్కొన్నారు. బుధవారం అందోల్ పరిధి రాంసాన్‌పల్లి గ్రామంలో సాగవుతున్న మామిడి తోటను వారు పరిశీలించారు. ఈ మాసంలో మామిడి తోటలో ముఖ్యంగా పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు తెలియజేశారు. ప్రధానంగా ఈ మాసంలో మామిడిలో కొమ్మల కత్తిరింపు చేయాలన్నారు. ప్రూనింగ్ కూడా క్రమపద్ధతిలో చేసుకోవడంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్రధానంగా మామిడిలో రసం పీల్చే పురుగుల యాజమాన్యం, సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలన్నారు. జూలై మాసంలో ఎండు కొమ్మలను తీసివేసి లీటర్ నీటికి 3 గ్రా.కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. కాండంపైన సూర్యరశ్మిని నిరోధించే గుబురైన కొమ్మలను కత్తిరించి, చెట్టులోపలికి గాలి వెలుతురు ప్రసరించేలా చూడాలన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

సంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ



ఫలహారం బండ్ల ఊరేగింపులో ఎమ్మెల్యే

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల్లో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి ఫలహారం బండ్ల ఊరేగింపులో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, ఆయా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డిపోలో ఉచిత ప్రయాణాల వేడుకలు

జహీరాబాద్ టౌన్: మహాలక్ష్మి పథకం ద్వారా 200 కోట్ల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆర్టీసీ డిపోలో బుధవారం వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ సుభాష్‌రావు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. సుభాష్‌రావు మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకం మహిళలకు గొప్ప వరమని, రాష్ట్రంలో ఉచితంగా ఎక్కడికైనా ప్రయాణం చేయవచ్చని చెప్పారు. ఇప్పటివరకు 200 కోట్ల మంది మహిళలు ప్రయాణం చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ టి.స్వామి, అసిస్టెంట్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, గ్యారేజ్ ఇన్‌చార్జి తిరుమలేష్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షులు అరుణ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులను అందజేసిన కమిషనర్ సుభాష్‌రావు

స్థానిక సంస్థల ఎన్నికలపై సమావేశం

జిన్నారం (పటాన్‌చెరు): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బుధవారం గుమ్మడిదల మండల బీజేపీ అధ్యక్షుడు ఐలయ్య అధ్యక్షతన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మీనాగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానికఎన్నికల్లో బీజేపీ నాయకులు ఆయా స్థానాల్లో పోటీ చేసి అత్యధిక స్థానాలు గెలుపొందాలన్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్థాయి పదాధికారులు శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండలంలోని పెద్దాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం కుమార్ గౌడ్ , శ్రీనివాస్, నరేష్ సహకారంతో ఎంఈఓ శంకర్ భోజనం ప్లేట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా నాగ్సాన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను సందర్శించి వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వినయకుమార్, హెచ్‌ఎంలు క్రిష్ణయ్య, గోపినాయక్, రాంరెడ్డి, సీఆర్పీ రాజేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ సిర్గాపూర్ ఎస్ఐగా మహేశ్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ ఎస్ఐగా జి.మహేశ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన వెంకట్‌రెడ్డి సీఐగా పదోన్నతి పొందారు. ట్రైనీ ఎస్ఐగా పనిచేసిన జి.మహేశ్‌ను సిర్గాపూర్ ఎస్ఐగా నియమిస్తూ ఎస్పీ పరితోశ్ పంకజ్ ఉత్తర్వులు జారీ చేశారు.

◆ శాంతి భద్రతలకు కృషి

ఝరాసంగం(జహీరాబాద్): మండలంలో శాంతి భద్రతలకు కృషి చేస్తానని ఎస్ఐ క్రాంతి కుమార్ పాటిల్ తెలిపారు. ఝరాసంగం ఎస్ఐ గా నియమితులైన ఆయన బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. వీఆర్ సంగారెడ్డి నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎస్ఐ నరేష్ కోహిర్‌కు బదిలీపై వెళ్లారు. కొత్తగా వచ్చిన ఎస్ఐ ముందుగా దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన కేతకీ సంగమేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

◆ గుమ్మడిదల ఎస్ఐగా లక్ష్మీకాంత్ రెడ్డి

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల నూతన ఎస్ఐగా పెరుమాళ్ల లక్ష్మీకాంత్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. గుమ్మడిదల పారిశ్రామిక ప్రాంతం కావడంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ భరత్ భూషణ్ చార్మినార్ ఫోర్త్ జోన్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు.

◆ హద్నూర్ ఎస్ఐగా సుజిత్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని హద్నూర్ ఎస్ఐగా దోమ సుజిత్ నియమితులయ్యారు. ఇక్కడ పని చేసిన చల్లా రాజశేఖర్ సంగారెడ్డికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఎస్ఐని బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో (సంగారెడ్డి నుంచి వేటింగ్ లిస్టులో ఉన్న)దోమ సుజిత్ వచ్చారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. విధుల్లో చేరిన నూతన ఎస్ఐని బుధవారం పలువురు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలసి సన్మానించారు.

◆ కుట్టు మిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం

జిన్నారం (పటాన్‌చెరు): గ్రామీణ ప్రాంతాల మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గ్రామ స్వరాజ్ సంస్థ కృషి చేస్తుందని కొడకంచి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రేమావతి అన్నారు. బుధవారం కొడకంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నెల రోజులపాటు ఉచిత శిక్షణ నిస్తూ 50శాతం సబ్సిడీపై కుట్టు మిషన్లు అందజేయడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు.

◆ రాయికోడ్ ఎస్ఐగా చైతన్యకిరణ్



రాయికోడ్(అందోల్): రాయికోడ్ ఎస్ఐగా ఎం. చైతన్య కిరణ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్ఐ నారాయణ ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుమ్మడిదల మండలంలో ట్రైనింగ్ పూర్తి చేసుకున్న చైతన్య కిరణ్‌నురాయికోడ్ ఎస్ఐగా అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.